RNI. No. TELTEL /2022/ 89348




మన వార్తలు.. మన సమాచారం.. మన విశేషాల మాగాణ.. మన..

# తెలంగాణ అవతరణ

ఆత్మ గౌరవ అక్షర సాక్ష్యం

తె లు గు  ది న  ప త్రి క

సంపుటి : 4 సంచిక : 108 | పెద్దపల్లి | ఎడిటర్ : పి. రామకృష్ణ | ఆదివారం, ఏప్రిల్, 12, 2026 | పేజీలు : 8 | వెల : రూ. 5/-


### చరిత్ర సృష్టించి విజయవంతంగా..

## భూమికి చేరిన 'ఆర్టెమిస్-2'

ఢిల్లీ,:అర్ధ శతాబ్దానికి పైగా నిరీక్షణకు తెరదించుతూ, మానవాళి మరో చారిత్రక విజయాన్ని నమోదు చేసింది. అమెరికా అంతరిక్ష పరిశోధనా సంస్థ నాసా ప్రయోగించిన ఆర్టెమిస్-2 యాత్రను విజయవంతంగా పూర్తి చేసుకున్న నలుగురు వ్యోమగాములు భూమికి సురక్షితంగా తిరిగొచ్చారు. వారి ఒరైన్ క్యాప్సూల్ 'ఇంటెగ్రిటీ' పసిఫిక్ మహా సముద్రంలో విజయవంతంగా స్ప్లాష్‌డౌన్ అయింది. కమాండర్ రీడ్ వైస్‌మన్, పైలట్ విక్టర్ గ్లోవర్, క్రిస్టినా కోచ్, కెనడాకు చెందిన జెరెమీ హాన్సెన్‌లతో కూడిన ఈ బృందం దాదాపు 10 రోజుల పాటు చంద్రుడి చుట్టూ ప్రయాణించి తిరిగి వచ్చింది. భూ వాతావరణంలోకి ప్రవేశించే ఘట్టం అత్యంత ఉత్కంఠభరితంగా సాగింది. ధ్వని వేగం కన్నా 33 రెట్లు అధిక వేగంతో (Mach 33) క్యాప్సూల్ భూమి వైపు దూసుకొచ్చింది. అపోలో యాత్రల తర్వాత ఇంతటి వేగంతో వ్యోమనౌక భూమిని చేరడం ఇదే తొలిసారి. వాతావరణంలోకి ప్రవేశించాక, వేలాది డిగ్రీల ఉష్ణోగ్రత నుంచి క్యాప్సూల్‌ను రక్షించే హీట్ షీల్డ్ పనితీరుపైనే అందరి దృష్టి నిలిచింది.

ఈ సమయంలో దాదాపు ఆరు నిమిషాల పాటు మిషన్ కంట్రోల్‌కు, వ్యోమగాములకు మధ్య కమ్యూనికేషన్ పూర్తిగా నిలిచిపోయింది. ఆ తర్వాత పారాచూట్లు తెరుచుకోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. శాన్ డియాగో తీరంలో సిద్ధంగా ఉన్న యూఎస్ఎస్ జాన్ పి. ముర్తా నౌక సిబ్బంది వ్యోమగాములను సురక్షితంగా బయటకు తీసుకొచ్చారు.

రికార్డుల యాత్ర : ఈ యాత్రలో వ్యోమగాములు అనేక రికార్డులు సృష్టించారు. అపోలో 13 నెలకొల్పిన రికార్డును బద్దలు కొడుతూ, భూమి నుంచి అత్యంత దూరంగా 4,06,771 కిలోమీటర్లు ప్రయాణించారు. ఇప్పటివరకు మానవ



కన్ను చూడని చంద్రుడి అవతలి వైపు చిత్రాలను చిత్రీకరించారు. అంతరిక్షం నుంచి సంపూర్ణ సూర్యగ్రహణాన్ని వీక్షించి అబ్బురపడ్డారు. యాత్రలో కొన్ని సాంకేతిక సమస్యలు తలెత్తినప్పటికీ, వాటన్నింటినీ అధిగమించి యాత్రను విజయవంతం చేశారు. 1972 నాటి అపోలో 17 యాత్ర తర్వాత మానవులు చంద్రుడివద్దకు వెళ్లి రావడం ఇదే ప్రథమం. ఈవిజయం 2028లో చంద్రుడి దక్షిణ ధ్రువంపై మనుషులను దించాలనే లక్ష్యంతో చేపట్టనున్న ఆర్టెమిస్-4 వంటి భవిష్యత్ ప్రయోగాలకు మార్గం సుగమం చేసింది.

## రైతు రుణమాఫీపై తప్పుడు ప్రచారం వద్దు

### హరీశ్ రావు విమర్శలకు మంత్రి తుమ్మల కౌంటర్

హైదరాబాద్,: గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో జరిగిన రైతు రుణమాఫీ కేవలం వడ్డీలకే సరిపోయిందని, తమ ప్రభుత్వం మాత్రం చిత్తశుద్ధితో రైతులకు లబ్ధి చేకూరుస్తోందని తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు స్పష్టం చేశారు. హైదరాబాద్‌లో మీడియా ప్రతినిధులతో మాట్లాడిన ఆయన... రుణమాఫీ, రైతు భరోసా అంశాలపై మాజీ మంత్రి హరీశ్ రావు చేస్తున్న విమర్శలను తీవ్రంగా ఖండించారు. రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 25 లక్షల మంది రైతులకు, ఒక్కొక్కరికి రూ. 2 లక్షల చొప్పున రుణమాఫీని విజయవంతంగా పూర్తి చేశామని ఆయన వివరించారు. సుమారు 40 బ్యాంకులు అందించిన డేటా ఆధారంగా అర్హులైన ప్రతి రైతుకూ ఈ ప్రయోజనం చేకూరేలా చర్యలు తీసుకున్నామని తుమ్మల క్లారిటీ ఇచ్చారు. ఆర్థికంగా అనేక సవాళ్లు ఉన్నప్పటికీ రైతు సంక్షేమం కోసం తమ ప్రభుత్వం వెనకడుగు వేయలేదని మంత్రి గుర్తు చేశారు. గత ప్రభుత్వ హయాంలో రైతుబంధు నిధుల విడుదల కోసం రైతులు నెలల తరబడి వేచి చూడాల్సి వచ్చేదని, కానీ తమ ప్రభుత్వం కేవలం తొమ్మిది రోజుల వ్యవధిలోనే రూ. 9వేల కోట్ల రైతు భరోసా నిధులను



రైతుల ఖాతాల్లో జమ చేసి రికార్డు సృష్టించిందని తెలిపారు. రెండు పంటలకాలంలోనే రైతులసంక్షేమం కోసం దాదాపు లక్ష కోట్ల రూపాయలుఖర్చు చేసిన ఘనత తమకే దక్కుతుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. రైతులకు ఈ స్థాయిలో మేలు చేస్తున్న ప్రభుత్వం దేశంలో ఎక్కడైనా ఉందేమో హరీశ్ రావు సమాధానం చెప్పాలని తుమ్మల సవాల్ విసిరారు. నిరాధారమైన ఆరోపణలతో రైతులను తప్పుదోవ పట్టించవద్దని ఆయన ప్రతిపక్ష నేతలకు హితవు పలికారు.

### అమీన్‌పూర్‌లో హైడ్రా భారీ ఆపరేషన్

## భారీ బందోబస్తు మధ్య ఆక్రమణ కూల్చివేత




సంగారెడ్డి, ఏప్రిల్11 : సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్‌లో హైడ్రా భారీ ఆపరేషన్ చేపట్టింది. భారీ పోలీసు బందోబస్తు మధ్య ఆక్రమణలను కూల్చి వేస్తోంది. రెవెన్యూ, మున్సిపల్ అధికారులతో కలిసి ఈ భారీ ఆపరేషన్‌ను నిర్వహిస్తోంది. కోర్టు స్టే ఆర్డర్ ఉన్నా.. నిర్మాణాలు జరిపిన ఓ గెస్ట్ హౌస్‌తో పాటు, ఆరు అంతస్తుల భవనాన్ని హైడ్రా కూల్చివేస్తోంది. ఐలాపురం తండాతో పాటు గ్రామంలోని పేదల ఇళ్ల జోలికి వెళ్లకుండా ఖాళీ స్థలాలను హైడ్రా స్వాధీనం చేసుకుటోంది. సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్ మండలం ఐలాపురం గ్రామంలో మొత్తం 1263 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. ఇందులో ఇప్పటికే చాలా నివాసాలు వెలిశాయి. ఆ నివాసాల జోలికి వెళ్లకుండా మిగిలి ఉన్న 860 ఎకరాల ప్రభుత్వ భూమిని రక్షించేందుకు చర్యలు చేపట్టింది. 863 ఎకరాల భూమి విలువ రూ.15 వేల కోట్లకు పైగా ఉంటుందని అంచనా. ఇక్కడ యథాతథ స్థితిని కొనసాగించాలని 1998 నుంచి కోర్టు ఆర్డర్లున్నా పట్టించుకోకుండా నిర్మించిన గెస్ట్ హౌస్‌ను హైడ్రా తొలగించింది.

అలాగే ఎలాంటి అనుమతులు లేకుండా నిర్మించిన 6 అంతస్తుల భవనాన్ని తొలగిస్తోంది. ఐలాపురం తండాలో కానీ, గ్రామంలోని నివాస గృహాల జోలికి కానీ వెళ్లకుండా చర్యలు చేపట్టినట్లు హైడ్రా అధికారులు స్పష్టం చేశారు. కేవలం అక్రమంగా నిర్మించిన భారీ కట్టడాలు, ఖాళీ స్థలాల స్వాధీనంపైనే దృష్టి సారించినట్లు తెలిపారు. 1998 నుంచి 'స్టేటస్ కో' కొనసాగించాలని కోర్టు ఆర్డర్లు ఉన్నప్పటికీ, వాటిని ఖాతరు చేయకుండా ముఖిమ్ నిర్మించిన గెస్ట్ హౌస్‌ను హైడ్రా నేలమట్టం చేసింది. అలాగే అతని సోదరుడు అజీమ్ ఎటువంటి అనుమతులు లేకుండా నిర్మించిన 6 అంతస్తుల భవనాన్ని కూడా అధికారులు తొలంచారు. ఐలాపూర్ గ్రామంలో మొత్తం 1263 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది.

ఇందులో ఇప్పటికే అనేక నివాసాలు వెలిశాయి. మిగిలి ఉన్న 860 ఎకరాల ఖాళీ ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకోవడమే లక్ష్యంగా హైడ్రా ఈ ఆపరేషన్ చేపట్టింది. ఈ భూమి విలువ సుమారు రూ.15 వేల కోట్ల పైమాటే ఉందని అంచనా. కూల్చివేతలు కొనసాగుతున్న నేపథ్యంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా భారీగా పోలీసులను మోహరించారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా భారీగా పోలీసులు మోహరించారు. హైడ్రా చేపట్టిన ఈ భారీ ఆపరేషన్ వల్ల వేల కోట్ల విలువైన ప్రభుత్వ భూమి అన్యాక్రాంతం కాకుండా కాపాడగలిగారు.

## పూలే ఆశయాల సాధనకు బీఆర్ఎస్ కృషి

### గత పదేండ్లలో విప్లవాత్మక పథకాల అమలు: కేసీఆర్



హైదరాబాద్,: వర్ణ వివక్షకు వ్యతిరేకంగా తన జీవితకాలం పోరాడిన భారతదేశ సామాజిక విప్లవకారుడు, సమ సమాజ స్థాపన మార్గదర్శి, మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి సందర్భంగా వారు జాతికి చేసిన సేవలను బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ స్మరించుకున్నారు. భారత సమాజంలో వర్ణ, కుల లింగ వివక్షతను రూపుమాపి, సామాజిక న్యాయం దక్కాలని పోరాడిన దార్శనికుడు మహాత్మా పూలే అని కొనియాడారు. సబ్బండ వర్ణాలు సామాజిక ఆర్థిక రంగాల్లో ముందడుగు వేయాలంటే విద్య ద్వారా మాత్రమే సాధ్యమవుతుందని చెప్పిన జ్యోతిరావు పూలే ఆశయాలు ఎల్లకాలం ఆచరణీయమైనవని కేసీఆర్ తెలిపారు. తన భార్య సావిత్రి బాయి పూలేకు చదువు నేర్పించి మరీ, చదువు నిరాకరించబడిన భారత మహిళకు విద్య నేర్పాలనే ధృఢ సంకల్పాన్ని అనేక కష్ట నష్టాల నడుమ అమలు చేసిన, మహిళాభ్యుదయ మార్గదర్శి మహాత్మా పూలే అని కొనియాడారు. పూలే ఆశయాలను నిజం చేస్తూ, తన పదేండ్ల ప్రగతి పాలనలో, నాటి బీఆర్ఎస్ ప్రభుత్వం సబ్బండ కులాల అభ్యున్నతి కోసం అమలు చేసి ఫలితాలను సాధించిన పలు రకాల పథకాలను కార్యాచరణను కేసీఆర్ గుర్తు చేసుకున్నారు. సాగునీరు, విద్యుత్, రైతుబంధు, రైతు బీమా వంటి పథకాలు అమలు చేసి వ్యవసాయ రంగాన్ని పటిష్టపరిచామని తెలిపారు. పలు వృత్తికులాలను ప్రోత్సహిస్తూ గొర్రెల పెంపకం, చేపల పంపిణీ,నేతన్నకు చేయూత వంటిపథకాలను అమలు చేయడం ద్వారా నూటికి తొంభైశాతంగా ఉన్న దళిత బహుజన కులాలు ఆర్థికంగా నిలదొక్కుకున్నాయని తెలిపారు. తద్వారా, తెలంగాణ గ్రామీణ ఆర్థిక వ్యవస్థ పునరుజ్జీవనంజరిగిందని అన్నారు. ఆసరా ఫించన్లు, బీసీ బంధు వంటి బహుజన సంక్షేమ పథకాల అమలు ద్వారా, వెనకబడి ఉన్న సబ్బండ కులాలను ఆర్థికంగా అభివృద్ధి చేసామన్నారు. బీసీ కులాల విద్యకోసం ప్రత్యేక రెసిడెన్షియల్ విద్యాసంస్థలను ఏర్పాటు చేసి వారికి అంతర్జాతీయ స్థాయి విద్యనందించినామని కేసీఆర్ తెలిపారు. బీసీ బిడ్డల భవిష్యత్తు తరాల ప్రయోజనాలను నెరవేర్చేందుకు రాష్ట్ర రాజధాని నగరంహైద్రాబాద్ లో ఆత్మగౌరవ భవన నిర్మాణాల కోసం, అత్యంత విలువైన స్థలాలను, నిర్మాణ నిధులను,బీసీ కుల సంఘాలకు కేటాయించినామని తెలిపారు. బీసీకులాల ఆత్మగౌరవాన్ని నిలబెట్టేందుకు పూలే ఆశయాలకు అనుగుణంగా తాము గత ప్రభుత్వంలో అమలులోకి తెచ్చిన ప్రగతి కార్యాచరణను చిత్తశుద్ధితో కొనసాగించాలని రాష్ట్ర ప్రభుత్వానికి సూచించారు. తద్వారా మాత్రమే మహాత్మాపూలేకు మనం ఘన నివాళి అర్పించిన వారమవుతామని కేసీఆర్ స్పష్టం చేశారు.

### ప్లాన్ బీ లేదు.. ఇరాన్‌తో చర్చలకు ముందు..

## ట్రంప్ సంచలన వ్యాఖ్యలు



వాషింగ్టన్: పశ్చిమాసియాలో యుద్ధానికి ముగింపు పలికే లక్ష్యంతో అమెరికా, ఇరాన్ మధ్య ఉన్నతస్థాయి చర్చలు ఇవాళ పాకిస్థాన్‌లోని ఇస్లామాబాద్‌లో ప్రారంభమయ్యాయి. అయితే, ఈ చర్చలు విఫలమైతే తమ వద్ద ఎలాంటి ప్రత్యామ్నాయ ప్రణాళిక (ప్లాన్ బీ) లేదని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఇరాన్ సైనిక శక్తిని తాము పూర్తిగా దెబ్బతీశామని, అందుకే ప్లాన్ బీ అవసరం లేదని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఈ చర్చల కోసం ఇరాన్ పార్లమెంట్ స్పీకర్ మహమ్మద్ బఘేర్ గాలిబాఫ్, విదేశాంగ మంత్రి సయ్యద్ అబ్బాస్ అరగ్చీలతో కూడిన ప్రతినిధి బృందం ఇస్లామాబాద్ చేరుకుంది. వారికి పాకిస్థాన్ మంత్రి ఇషాక్ దార్, ఆర్మీ చీఫ్ అసిమ్ మునీర్ స్వాగతం పలికారు. అమెరికా తరఫున ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ ప్రతినిధి బృందానికి నాయకత్వం వహిస్తున్నారు. పారిస్ నుంచి బయలుదేరే ముందు వాన్స్ ఇరాన్‌ను హెచ్చరించారు. "వారు మాతో ఆడుకోవాలని ప్రయత్నిస్తే, మా చర్చల బృందం అంత సుముఖంగా ఉండదు" అని స్పష్టం చేశారు. గత కొన్ని వారాలుగా క్షిపణి దాడులతో అట్టుడికిన గల్ఫ్ ప్రాంతంలో ప్రస్తుతం రెండు వారాల కాల్పుల విరమణ అమలవుతోంది. ఈ ప్రశాంత వాతావరణంలోనే చర్చలు జరుగుతున్నప్పటికీ, అమెరికా తన బలగాలను పశ్చిమాసియాలో మరింతగా మోహరించడం ఉద్రిక్తతలను పెంచుతోంది. చర్చలకు ముందే ఇరు దేశాలు తమ తమ డిమాండ్లతో ముందుకు వచ్చాయి. అమెరికా 15 పాయింట్ల ఫ్రేమ్‌వర్క్‌ను ప్రతిపాదించగా, ఇందులో ఇరాన్ తన వద్ద ఉన్న శుద్ధి చేసిన యురేనియంను అప్పగించాలని, సైనిక పరిమితులను అంగీకరించాలని షరతులు విధించినట్లు సమాచారం. దీనికి ప్రతిగా ఇరాన్ 10 పాయింట్ల ప్రణాళికను పంపింది. యుద్ధ నష్టపరిహారం చెల్లించాలని, హర్మూజ్ జలసంధిపై తమ సార్వభౌమత్వాన్ని అమెరికా గుర్తించాలని కోరింది. "ఇరాన్ సైన్యం ఓడిపోయింది. వారి వద్ద కొన్ని క్షిపణులు, పరిమిత తయారీ సామర్థ్యాలు మాత్రమే ఉన్నాయి. మా సైన్యం అద్భుతంగా పని చేసింది. వారిని గట్టిగా దెబ్బతీశాం" అని ట్రంప్ విలేకరులతో అన్నారు. మరోవైపు వచ్చే వారం లెబనాన్, ఇజ్రాయెల్ మధ్య కూడా చర్చలు జరగనుండటం ఈ ప్రాంతంలో దౌత్యపరమైన ప్రయత్నాలకు సూచికగా నిలుస్తోంది.

## బీసీ మహిళల ఉప కోటా కోసం ఢిల్లీని గడగడలాడిస్తాం

### తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత

హైదరాబాద్, : మహాత్మా జ్యోతిరావు పూలే ఆశయాల స్ఫూర్తితో చట్టసభల్లో బీసీ మహిళలకు ఉప కోటా సాధించే వరకు విశ్రమించే ప్రసక్తే లేదని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత స్పష్టం చేశారు. పూలే జయంతి వేడుకల సందర్భంగా బంజారాహిల్స్‌లోని జాగృతి కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొన్న ఆమె, మహిళా రిజర్వేషన్ బిల్లులో బీసీ మహిళలకు స్థానం కల్పించకపోవడంపై కేంద్ర ప్రభుత్వంపై విరుచుకుపడ్డారు. బీసీ మహిళలకు ఉప కోటా ఇవ్వకపోవడం అంటే పాలకులకు ఆ వర్గాల పట్ల గౌరవం లేదని అర్థమని, కేంద్రం వెన్నులో వణుకు పుట్టేలా మరోసారి పూలే పుట్టారా అన్నట్లుగా జాగృతి ఆధ్వర్యంలో ఉద్ధృత పోరాటం చేస్తామని ఆమె హెచ్చరించారు. పార్లమెంట్‌లో ఈ నెల 16 నుంచి 18వ తేదీ వరకు మహిళా బిల్లుపై జరగనున్న చర్చా సమయంలో తాను స్వయంగా ఢిల్లీకి వెళ్లి



వివిధ రాజకీయ పార్టీల నేతలను కలుస్తానని కవిత వెల్లడించారు. కేవలం మెజారిటీ ఉందన్న అహంకారంతో బీసీలకు అన్యాయం చేస్తూ బిల్లును ఆమోదిస్తే ఊరుకునేది లేదని తేల్చిచెప్పారు. మరోవైపు రాష్ట్రంలో పూలే విగ్రహ ఏర్పాటు విషయంలో ప్రభుత్వం అనుసరిస్తున్న జాప్యాన్ని ఆమె తీవ్రంగా ఖండించారు. అసెంబ్లీ ప్రాంగణంలో పూలే విగ్రహం పెట్టాలని డిమాండ్ చేస్తే... ట్యాంక్ బండ్ వద్ద పెడతామని చెప్పి, ఇప్పటికీ పనులు పూర్తి చేయలేదని మండిపడ్డారు. కనీసం అంబేద్కర్ జయంతి నాటికైనా ఆ పనులను పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. విద్యుత్ శాఖలో పనిచేస్తున్న ఆర్టిజన్ల సమస్యలపై కూడా కవిత ఈ సందర్భంగా గళమెత్తారు. వారి క్రమబద్ధీకరణ కోసం జరుగుతున్న పోరాటానికి జాగృతి పూర్తి మద్దతు ఇస్తుందని, కొత్తగూడెంలో జరుగుతున్న ఆందోళనల్లో తమ నాయకులు పాల్గొంటారని ప్రకటించారు. గతంలో ఆర్టిజన్ల వేతనాలు పెంచడంలో జాగృతి కీలక పాత్ర పోషించిందని గుర్తు చేస్తూ, ఇప్పుడు వారిపై ప్రభుత్వం చర్యలకు దిగాలని చూడటం సరికాదన్నారు. పూలే చూపిన సామాజిక న్యాయం బాటలో నడుస్తూ అణగారిన వర్గాల హక్కుల కోసం అహర్నిశలు శ్రమించడమే ఆయనకు ఇచ్చే అసలైన నివాళి అని ఆమె కార్యకర్తలకు పిలుపునిచ్చారు

### పోలీసులపై ప్రేమోన్మాది దాడి.. కాల్పుల్లో నిందితుడికి గాయాలు

అమరావతి : కడప జిల్లా ఖాజీపేటలో యువతి గొంతు కోసి హత్య చేసిననిందితుడు ప్రేమోన్మాది వెంకటేశ్ శనివారం పోలీసుల పై దాడి చేశారు. పోలీసులు జరిపిన కాల్పుల్లో నిందితుడికి గాయాలు అయ్యాయి. యువతిపై దాడి, హత్య అనంతరం నిందితుడు వెంకటేశ్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కాగా శనివారం తెల్లవారుజామున నిందితుడిని మైదుకూరు నుంచి వేరే ప్రాంతానికి తరలిస్తుండగా తప్పించుకునేందుకు యత్నించి ఇద్దరు కానిస్టేబుళ్లను గాయపరిచాడు. పరారవుతున్న వెంకటేశ్‌పై పోలీసులు కాల్పులు జరపడంతో గాలిలోకి మూడు రౌండ్ల కాల్పులు, నిందితుడి కాళ్లపై మరో రౌండ్ కాల్పులు జరిపి పట్టుకున్నారు.

# సంపాదకీయం

## మోదీ మోడల్ రాజకీయ శాస్త్రం

ప్రధాని నరేంద్ర మోదీ అరుదైన మైలురాయిని చేరుకున్నారు. మనదేశంలో సుదీర్ఘకాలం పాటు ప్రభుత్వాధినేతగా వ్యవహరించిన రికార్డును ప్రధాని మోదీ సొంతం చేసుకున్నారు. సిక్కిం మాజీ సీఎం పవన్ కుమార్ చామ్లింగ్ రికార్డును మోదీ ఆదివారంతో అధిగమించారు. సీఎంగా 8,930 రోజుల పాటు సేవలను అందించిన రికార్డు పవన్ కుమార్ చామ్లింగ్ పేరిట ఉన్న రికార్డును మోదీ బద్దలు కొట్టారు. గుజరాత్ సీఎంగా, దేశ ప్రధానిగా ప్రభుత్వాధినేత హోదాలలో నరేంద్ర మోదీ 8,931 పనిదినాలను పూర్తి చేసుకుని అరుదైన భారత రాజకీయ వేత్తగా నిలిచారు. దీర్ఘకాలం పాటు గుజరాత్ సీఎంగా వ్యవహరించిన రికార్డు నరేంద్రమోదీ పేరిట ఉంది. సీఎంగా సేవలు అందించే అవకాశం ఆయనకు నాలుగుసార్లు లభించింది. 2001 అక్టోబరు 7 నుంచి 2002 డిసెంబరు 22 వరకు, 2002 డిసెంబరు 22 నుంచి 2007 డిసెంబరు 22 వరకు, 2007 డిసెంబరు 23 నుంచి 2012 డిసెంబరు 20 వరకు, 2012 డిసెంబరు 20 నుంచి 2014 మే 22 వరకు నాలుగు దఫాలు ఆయన సీఎంగా వ్యవహరించారు. 2014 నుంచి మోదీ వరుసగా మూడు పర్యాయాలు దేశ ప్రధానిగా ఎన్నికయ్యారు..గెలుపును అలవాటుగా చేసుకున్న నాయకుడు: ప్రజాస్వామ్యంలో రాజకీయ గెలుపు సాధించడమే అంతికాదని నిరూపించిన నాయకుడు భారత ప్రధానమంత్రి నరేంద్రమోదీ. అధికారాన్ని సుస్థిర పరచడం అత్యంత నైపుణ్యమని ఆయన ప్రతీసారి నిరూపిస్తూ వచ్చారు. అధికారాన్ని సంపాదించడం కంటే, దాన్ని స్థిరపరుచుకోవడంలోనే నాయకుడి అసలైన సామర్థ్యం బయటపడుతుందన్నది రాజకీయ నానుడి. ఆ విషయంలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఎప్పుడు సక్సెస్ అవుతూనే.. ప్రత్యర్థులను ఆశ్చర్యానికి గురి చేస్తూ వస్తున్నారు. నరేంద్రమోదీ ప్రస్థానం ఒక నిర్మిత రాజకీయ ప్రయోగశాల. పరిస్థితులను అర్థం చేసుకోవడం, వాటిని రాజకీయంగా మల్చుకోవడంలో ఆయన్ను మించిన భారత రాజకీయ వేత్తల్లో సాటిలేరన్నది విశ్లేషకుల అభిప్రాయం. గుజరాత్‌లో అధికార బాధ్యతలు చేపట్టిన తొలి దశలోనే ఆయన తన శైలిని స్పష్టంగా ప్రకటించారు. సంక్షోభాన్ని ఎదుర్కొనే నాయకుడిగానే కాకుండా, సంక్షోభాన్ని అవకాశంగా మలిచే వ్యూహకర్తగా ముందుకొచ్చారు. పునర్నిర్మాణాన్ని పరిపాలనా చర్యగా కాకుండా, అభివృద్ధిగా మలచడం ద్వారా ఆయన ఒక కొత్త రాజకీయ వైఖరిని సృష్టించారు. ఆయన గుజరాత్‌లో సాధించి పెట్టిన అభివృద్ధి బ్రాండ్.. బీజేపీకి దేశ వ్యాప్తంగా మరెంతో కీర్తిని తెచ్చిపెట్టింది. దేశవ్యాప్తంగా "గుజరాత్ మోడల్" ప్రచారంలోకి వచ్చింది. నరేంద్రమోదీ దేశ రాజకీయాల్లోకి ప్రవేశంతోనే వైబ్రేషన్ మొదలైంది. గుజరాత్‌లో 12 ఏళ్లు సీఎంగా పనిచేసిన అనుభవం.. ఇచ్చిన వాగ్దానాలను నెరవేర్చిన తీరు కలగలిసి 2014ఎన్నికల్లో బీజేపీకి పెద్ద ఆస్తిగా మారాయి. పాత రాజకీయాలతో విసిగిపోయిన ఓటరుకు కొత్త ఆశగా, వ్యవస్థపై అసంతృప్తి ఉన్న వర్గాలకు కొత్త అవకాశంగా తనను తాను ప్రతిష్టించుకోవడంలో మోదీ సక్సెస్ అయ్యారు. ఫలితంగానే 2014లో జరిగిన దేశ రాజకీయ మార్పునకు కారణమైం ది. మోదీ రాజకీయ ప్రయాణాన్ని పరిశీలిస్తే, అది ఒక నిరంతర రూపాంతర క్రమంలా కనిపిస్తుంది. ఒక దశలో భావోద్వేగాల ప్రతినిధి గా, మరొక దశలో అభివృద్ధి శిల్పిగా, ఇంకొక దశలో జాతీయ గర్వానికి ప్రతీకగా కనిపిస్తారు. ఈ రీ-బ్రాండింగ్ సామర్థ్యమే ఆయనను ఒక వ్యక్తి నుంచి ఒక రాజకీయ ప్రబల శక్తిగా మార్చిదని చెప్పాలి. సాహసం.. సర్దుబాటు : మోదీ రాజకీయ సమీకరణంమోదీ నిర్ణయాల స్వభావాన్ని గమనిస్తే, అవి తరచుగా సాహసోపేతంగా కనిపిస్తాయి. ఆర్టికల్ 370 రద్దు, ట్రిపుల్ తలాక్ నిషేధం, అయోధ్యలో రామమందిర నిర్మాణం ఇవన్నీ భావోద్వేగాలతో ముడిపడిన, రాజకీయంగా క్లిష్టమైన అంశాలు. కానీ ఇక్కడ ఆయన ప్రత్యేకత కేవలం నిర్ణయం తీసుకోవడంలో కాదు; దాన్ని సమయోచితంగా అమలు చేయడంలో ఉంది. అదును చూసి దూకుడుగా నిర్ణయాలు తీసుకుంటారు. ఆపరేషన్ సింధూరు, సర్జికల్ స్ట్రైక్ గొప్ప ఉదాహరణలు.

అవసరమైతే వెనక్కి తగ్గే సమయోచిత సర్దుబాటు.. సందర్భాలను మోదీ ప్రదర్శించిన తీరు రాజకీయ నైపుణ్యతకు నిదర్శనం. రైతు చట్టాల ఉపసంహరణ ఇందుకు ఉదాహరణగా చెప్పవచ్చు. ఎన్నికల్లొచ్చిన్నప్పుడే జనంతో కలిసి పోవడం అనే దానికి మోదీ మోడల్ రాజకీయం విరుద్ధం. పార్టీ నిలదొక్కుకోలేని దక్షిణాదిలో కూడా ఆయన ఎన్నికల సమయంలో విస్తృతంగా ప్రచారం చేస్తూ వస్తున్నారు. ప్రయత్నం చేస్తే ఖచ్చితంగా ఫలితాలు సానుకూలంగా వస్తాయనేదానికి బీజేపీ ఈశాన్య భారతంలో సాధించిన విజయమే మంచి ఉదాహరణగా చెప్పవచ్చు. ఎన్నికలను ఒత్తిడిగా కాకుండా, అవకాశంగా మలచడం మోదీ ప్రత్యేకతగా చెప్పవచ్చు. మోదీ విజయానికి మూలమైన మరో స్తంభం కమ్యూనికేషన్. రాజకీయాల్లో సందేశం ఎంత ముఖ్యమో, దాన్ని ఎలా చేరవేయాలో తెలిసి ఉ ఒడటం అంతకంటే ముఖ్యం. ఈ రెండింటినీ సమన్వయం చేయడంలో ఆయన చూపిన నైపుణ్యం ప్రత్యేకంగా నిలుస్తుంది. సోషల్ మీడియాను ఆయుధంగా మలచుకోవడం, ప్రత్యక్షంగా ప్రజలతో సంభాషించడం వంటి వ్యూహాలు..అనుసంధాన వ్యవస్థలు మోదీని జనంతో ఇంటారాక్ట్ చేసేలా చేశాయి. ప్రజల్లో "మనవాడే" మన మోదీ అనే అనే భావనను కలిగించాయి.ఈ బంధం పార్టీ మద్దతుదారులతోనే కాక.. విభిన్న అభిప్రాయాలున్న వర్గాల్లో కూడా ఆయనపై సానుకూలత ఉండటానికి ప్రధాన కారణంగా చెప్పవచ్చు. యువతను ఆకర్షించడం కూడా ఈ కమ్యూనికేషన్ వ్యూహంలో భాగమే. పాత రాజకీయ ఇమేజ్‌ను పక్కనబెట్టి, డిజిటల్ యుగానికి సరిపోయే నాయకుడిగా తనను ప్రతిష్ఠించడం ద్వారా ఆయన కొత్త ఓటర్ బేస్‌ను నిర్మించుకున్నారు. మోదీ రాజకీయ శైలిని గమనిస్తే "పరిస్థితులను అనుసరించడం కాదు, పరిస్థితులను ప్రభావితం చేయడం".అనేది సుస్పష్టమవుతుంది. సుదీర్ఘ కాలం అధికారంలో కొనసాగడంఅనేది యాదృచ్ఛికంఫలితాల్లో సాను కూలత వ్యవహారం కాదు. వెూదీ స్టైల్‌ను గమనిస్తే పక్కా ప్రణాళిక.. అదే స్థాయిలోరాజకీయ నిర్వహణ ఉండటమని అర్థమవుతుంది. పార్టీ నిర్మాణాన్ని విస్తరించడం, కొత్త వర్గాలను చేర్చుకోవడం, సంప్రదాయ రాజకీయ పరిమితులను అధిగమించడం ఇవన్నీ ఆయన నాయకత్వం లో కనిపించే అంశాలు. ఒక్క విజయంతో సంతృప్తి చెందకుండా, విజయాన్ని అలవాటుగా మార్చుకోవడం అదే ఆయన రాజకీయ తత్వం. గెలవడం కాదు, గెలుపును పునరావృతం చేయడం ముఖ్యం అన్నది మోదీ మోడల్ పొలిటికల్ థియరీని గమనిస్తే అర్థమవుతుంది. మోదీ ప్రస్థానం ఒక సాధారణ రాజకీయ ప్రయాణం కాదు.. అది ఆధునిక భారత రాజకీయాల్లో ఒక నమూనాగా నిలిచిపోతుంది.

## 'ఖని' ప్రభుత్వాసుపత్రిలో

# వ్యసన భాదితులకు వైద్య సేవలు

### - అడిక్షన్ ఫెసిలిటీ సెంటర్ ను ప్రారంభించిన డిసిపి రాంరెడ్డి

తెలంగాణ అవతరణ, గోదావరిఖని, ఏప్రిల్ 11: సమాజంలో పెరుగుతున్న మత్తు పదార్థాల వినియోగాన్ని అరికట్టేందుకు, వ్యసన బాధితులకు సమగ్ర వైద్య సేవలు అందించేందుకు గోదావరిఖని గవర్నమెంట్ జనరల్ హాస్పిటల్ లో శనివారం ప్రత్యేకంగా "అడిక్షన్ ట్రీట్మెంట్ ఫెసిలిటీ"ని ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పెద్దపల్లి డీసీపీ రామ్ రెడ్డి, గోదావరిఖని ఏసీపీ మడత రమేష్, జిడికె-1వ టౌన్ సీఐ ఇంద్రసేన రెడ్డి హాజరై కార్యక్రమాన్ని ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యువతలో పెరుగుతున్న మత్తు పదార్థాల వినియోగం సమాజానికి ప్రమాదకరమని, అలాంటి వ్యసనాల నుండి బయటపడటానికి ఇలాంటి చికిత్స కేంద్రాలు ఎంతో ఉపయోగపడతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వైద్య నిపుణులు డా. అరుణ, డా. కృపాబాయి( సిఎస్ఆర్ఎంఓ), డా. రాజు, డా. రవివర్మ (సైకియాట్రిస్ట్) పాల్గొని వ్యసనాల వల్ల కలిగే శారీరక, మానసిక సమస్యలు, వాటి నివారణ గురుంచి వివరించారు. వ్యసన బాధితులు సరైన సమయంలో చికిత్స పొందితే పూర్తిగా కోలుకునే అవకాశం ఉందని తెలిపారు. ఈ కొత్త కేంద్రంలో డ్రగ్స్ అడిక్షన్ కౌన్సిలింగ్ సెంటర్, మత్తు పదార్థాల విష ప్రభావ సంరక్షణ



విభాగంతో పాటుగా ఔషధ చికిత్స, పునరావాస సేవలు అందుబాటులో ఉండనున్నాయని అధికారులు తెలిపారు. ప్రజలు ఈ సేవలను వినియోగించుకొని ఆరోగ్యకరమైన జీవితాన్ని గడపాలని కోరారు. ఈ కార్యక్రమంలో మెడికల్ స్టూడెంట్స్, నర్సింగ్ సిబ్బంది, ఆసుపత్రి సిబ్బంది, స్థానిక ప్రజలు, మరియు ఇతర అధికారులు పాల్గొన్నారు.

## 'ఖని' లెనిన్ నగర్ లో ఎమ్మెల్యే సతీమణి పర్యటన



తెలంగాణ అవతరణ, గోదావరిఖని, ఏప్రిల్ 11:రామగుండం నియోజకవర్గ ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ ఆదేశాల మేరకు ఆయన సతీమణి మనాలి ఠాకూర్ శనివారం గోదావరిఖని లెనిన్ నగర్ ప్రాంతంలో విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజలను కలుసుకుని తాగునీరు, రోడ్లు, కాలువలు, విద్యుత్ వంటి ప్రాథమిక సమస్యలను తెలుసుకున్నారు. వాటి పరిష్కారానికి సంబంధిత అధికారులతో మాట్లాడి త్వరితగతిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ప్రజల సమస్యల పరిష్కారం తమ ప్రధాన బాధ్యత అని తెలిపారు. అదేవిధంగా తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. పేదలు, మహిళలు, రైతులు, యువత కోసం చేపడుతున్న పథకాల ద్వారా జీవనోపాధి మెరుగుపడుతుందని చెప్పారు. అలాగే నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి పనులు, మౌలిక సదుపాయాల మెరుగుదలపై వివరించి, ప్రజల అభిప్రాయాలను స్వీకరించి ముందుకు సాగుతామని తెలిపారు.

## సింగరేణి అర్జీ-1లో

# పూలే జయంతి వేడుకలు



తెలంగాణ అవతరణ, గోదావరిఖని, ఏప్రిల్ 11: సింగరేణి అర్జీ-1 జిఎం కార్యాలయంలో శనివారం మహాత్మ జ్యోతిబా పూలే 199వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. వేడుకలకు ఇంచార్జి జి.యం కె. చంద్రశేఖర్ ముఖ్య అతిధిగా హాజరై కేక్ కట్ చేసి, మహాత్మ జ్యోతిబా పూలే చిత్రపటానికి పూలమాలలు, పుష్పాలు వేసి నివాళులర్పించారు. ఆలాగే బీసీ ఎంప్లాయిస్ అసోసియేషన్ అద్వర్యంలో ఆర్జీ.1 ఏరియాలోని జిడికె,1 అండ్ 3, 2 అండ్ 2ఎ, 11 ఇంక్లైన్ గనులు, ఓసి-5, అన్ని డిపార్ట్ మెంట్ లలో మహాత్మా జ్యోతీబా పూలె జయంతిని వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథి కె. చంద్రశేఖర్ మాట్లాడుతూ... సామాజిక తత్వవేత్త, ఉద్యమకారుడు, సంఘసేవకుడటైన జ్యోతీబా పూలే గోవిందరావ్ వెనుకబడిన బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికై చేసిన కృషిని స్పూర్తిగా తీసుకుని, వారి ఆశయాల సాధనకై బీసీ సోదరులు ఐఖ్యంగా ఉండాలని తెలిపారు. జ్యోతీబా పూలే చేసిన సామాజిక సేవకు గుర్తుగా ప్రజలు ఈయనను 'మహాత్మా' అని పిలుచుకుంటారన్నారు. అప్పట్లో అణగారిన వర్గాలకు, మహిళలకు చదువు అందేది కాదని విద్య ద్వారానే సామాజిక మార్పు సాధ్యమని ఆయన నమ్మారని తెలిపారు. పూలే కేవలం మాటలకే పరిమితం కాకుండా, సమాజంలో అంటరానితనం తొలగించడానికి తన ఇంట్లోని మంచి నీళ్ల ట్యాంకును కూడా అందరికీ అందుబాటులోకి తెచ్చారని పేర్కొన్నారు. బాబాసాహెబ్ అంబేద్కర్ వంటి మహనీయులకు జ్యోతిభా పూలే ఒక గొప్ప ప్రేరణ అని తెలిపారు. ఈ కార్యక్రమంలో విశిష్ట అతిథిగా ఆర్జీ రీజియన్ క్వాలిటి జియం సుజోయ్ మజుందర్, బిసి లైజన్ అధికారి పెరుమాళ్ళ శ్రీనివాస్, ఎఐటియుసి డిప్యూటీ జనరల్ సెక్రటరీ మడ్డి ఎల్లయ్య, బిసి అండ్ ఓబిసి సెక్రటరి బత్తుల పోషం, ఏజంట్ చిలుక శ్రీనివాస్, ఏరియా ఇంజనీర్ రామమోహనరావు, ఓసి.5 ప్రాజెక్ట్ ఆఫీసర్ రమేష్, పర్సనల్ మేనేజర్ రవీందర్ రెడ్డి, బీసీ ఎంప్లాయిస్ అసోసియేషన్ సభ్యులు దేవులపల్లి రాజేందర్, పెంచాలా తిరుపతి, దీటి చంద్రమౌళి, అధికారుల సంఘం ప్రతినిధి కోలా మల్లేష్, డివై.పియం నాగుల వేణు, జియం ఆఫీస్ ఎఐటియుసి ప్రతినిధి ఇజ్జగిరి రాజు, సీనియర్ పిఓ శ్రావణ్ కుమార్, పిఓఏ వూట్ల దేవాచారి మరియు ఇతర అధికారులు ఉద్యోగులు పాల్గొన్నారు.

## సింగరేణి స్టేడియం లో క్రికెట్ పోటీలను ప్రారంభించిన టీబీజీకేఎస్ వైస్ ప్రెసిడెంట్ వడ్డేపల్లి శంకర్





(తెలంగాణ అవతరణ ప్రతినిధి గోదావరిఖని)గోదావరిఖని సింగరేణి స్టేడియంలో సామాజిక సమతా వేదిక ఆధ్వర్యంలో జరుగుతున్న అంబేద్కర్ ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీలను ప్రారంభించిన తెలంగాణ బొగ్గు గనికార్మిక సంఘం ఆర్జీవన్ ఉపాధ్యక్షులు వడ్డేపల్లి శంకర్ వారికి ఘన స్వాగతం పలికిన జె వి రాజు, కొలుగూరి సాయికుమార్,(చింటు) జితేందర్ ,నితీష్, రంజిత్, శ్రవణ్ ,ఇరుగ్రాల గోపి, దూట శేషగిరి బ్రాంచ్ సెక్రటరీ టీబీజీకేఎస్ అడ్వకేట్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

## బీసీ ఒబిసి వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యం లో 2వ గనిలో ఘనంగా జ్యోతిబాపూలే జయంతి వేడుకలు బి సి ఓ బి సి వైస్ ప్రెసిడెంట్ పెంచాలా తిరుపతి ప్రధాన కార్యదర్శి



(తెలంగాణ అవతరణ ప్రతినిధి గోదావరిఖని) రామగుండం ఏరియా 1 జీడీకే 2 వ గనిలో శనివారం ఉదయం జ్యోతిబాపూలే జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. సమాజంలో మహిళల భిన్నతి కోసం అణగారిన వర్గాల కోసం జ్యోతిబాపూలే చేసిన సేవలను కొనియాడారు. వెనుకబడిన తరగతుల అభ్యున్నతి, సమానత్వం కోసం ఎనలేని కృషి చేశారు విద్య యొక్క గొప్పతనం గురించి అందరికీ తెలిపారు.స్వత హాగా మహిళ లకు విద్య అవసరమని గ్రహించి తన సతీమణి నే మొట్ట మొదటిసారిగా విద్యని అభ్యసించేలా చేసి మహిళలకి విద్యను అందించటానికి ఒక్క పాఠశాల ను కూడా స్థాపించారు. సమాజం లో సత్యం, సమన్యాయం అన్ని వర్గాల ప్రజలకి అందాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో గని మేనేజర్ రమేష్ బాబు అడిషనల్ మేనేజర్ జాన్సన్ బి సి ఓ బి సి వైస్ ప్రెసిడెంట్ పెంచాలా తిరుపతి ప్రధాన కార్యదర్శి బత్తుల పోచయ్య ఫిట్ ఇంజనీర్ సెంట్రల్ వైస్ ప్రెసిడెంట్ కోల మల్లేశం ఫిట్ సెక్రెటరీ రంజిత్ బిసి నాయకులు కొత్త రోజు మోహన్ వెల్ఫేర్ ఆఫీసర్ గణేష్ ఎస్సీ ఎస్టీ నాయకులు రామచందర్ ఏ ఐ టి యు సి నాయకులు రంగు శ్రీనివాస్ గౌడ్ వివిధ కార్మిక సంఘాల నాయకులు కార్మికులు మహిళా కార్మికురాలు తదితరులు పాల్గొన్నారు అనంతరం జ్యోతిబాపూలే జన్మదిన కేకు కట్ చేసి కార్మికులకు స్వీట్లు పంచారు.

## ఘనంగా జ్యోతి రావ్ పూలె జయంతి వేడుకలు

తెలంగాణ అవతరణ గోదావరిఖని, ఏప్రిల్ 11:మహాత్మా జ్యోతి రావ్ పూలె 199వ జయంతి వేడుకలు గోదావరిఖని పట్టణంలో శనివారం ఘనంగా జరిగాయి. ఇందులో భాగంగా రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో స్థానిక రాజేష్ టాకీస్ తీన్ రాస్తా వద్ద ఉన్న పూలె విగ్రహానికి మేయర్ మహంకాళి స్వామి, ఎమ్మెల్యే సతీమణి మనాలి ఠాకూర్ పూల మాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. పూలె చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో రామగుండం నగరపాలక సంస్థ డిప్యూటీ మేయర్ పాతపెల్లి ఎల్లయ్య, కార్పొరేటర్లు, కాంగ్రెస్ కార్యకర్తలు మరియు ఇతర ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.





# మరణించినా...ఒకరికి చూపునిచ్చాడు..!

## – రోడ్డు ప్రమాదంలో బల్దియా నైట్ వాచ్మెన్ మృతి

- చిన్నప్పుడే ఒక కంటి చూపును కోల్పోయిన వైనం
- ఉన్న ఒక్క కన్నును సైతం మరొకరికి వెలుగులు పంచడానికి దానం
- కుటుంబాన్ని అభినందించిన సదాశయ ఫౌండేషన్, లయన్స్ క్లబ్ ప్రతినిధులు
- నివాళులర్పించిన అధికారులు, కార్మిక సంఘాల ప్రతినిధులు

(తెలంగాణ అవతరణ ప్రతినిధి గోదావరిఖని) రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో వాచ్మెన్ గా పని చేస్తున్న ఇందారపు రాయపోషం(60), గోదావరిఖని లోని కాకతీయ నగర్ లో నివాసం ఉంటున్నాడు. ఇతనికి భార్య సమ్మక్క, కొడుకులు, కోడళ్ళు ప్రశాంత్ – పద్మ, కుమారస్వామి – జ్యోతి, కూతురు, అల్లుడు సత్యవతి – శ్రీనివాస్ తోపాటు మనమండ్లు , మనమరాళ్ళు ఉన్నారు. ఈనెల 10న నైట్ డ్యూటీ కోసం ఆఫీస్ కు వచ్చిన రాయపోషం, తోటి ఉద్యోగితో కలిసి బస్టాండ్ సమీపంలో టీ తాగడం కోసం అతని బైక్ పై వెళ్తుండగా, మున్సిపల్ టీ జంక్షన్ లో కారు ఢీ కొనడంతో రాయపోషం తలకు బలమైన గాయాలయ్యాయి. చికిత్స పొందుతూ జీజీహెచ్ ఆస్పత్రిలో మృతి చెందాడు.


విషయంలోనూ.. మానవత్వం..

రాయపోషంకు చిన్నప్పుడే ఒక కంటి చూపును పూర్తిగా పోయింది. రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో వాచ్మెన్ గా పని చేస్తున్న రాయమల్లు, విధినిర్వహణలో ఉత్తమ సేవలు అందిస్తూ ఆదర్శంగా నిలిచాడు. రాయపోషం అకాలమరణంతో కుటుంబ సభ్యులను విషాదంలోకి నెట్టింది. దుఃఖంలో ఉన్న కుటుంబ సభ్యులు రాయపోషంకు ఉన్న ఒక్క కన్నును కూడా సదాశయ ఫౌండేషన్ ప్రచార కార్యదర్శి కే ఎస్ వాసు సూచన మేరకు శనివారం దానం చేయడానికి అంగీకారం తెలిపారు. ఎల్వీ ప్రసాద్ ఐ బ్యాంక్ టెక్నీషియన్ ప్రదీప్ నాయక్ సహకారంతో సేకరించిన కార్నియాలను హైదరాబాద్ కు తరలించారు.

నివాళులర్పించిన అధికారులు, కార్మిక సంఘాల ప్రతినిధులు...

రాయపోషం పార్థీవ దేహాన్ని బల్దియా డిప్యూటీ కమిషనర్ వెంకటస్వామి, సానిటరీ ఇన్స్పెక్టర్ సంపత్ తోపాటు కార్మిక సంఘాల ప్రతినిధులు మురళీధర్ రావు, వై.యాకయ్య, గౌస్, వేల్పుల రాయమల్లు తదితరులు శనివారం సందర్శించి నివాళులర్పించారు. దహన సంస్కారాల కోసం బల్దియా అధికారులు రూ.20 వేలు ఆర్థిక సహాయాన్ని కుటుంబ సభ్యులకు అందించారు. అనంతరం వారి స్వగ్రామం తాడిచర్ల కు పార్థీవ దేహాన్ని తరలించి కుటుంబ సభ్యులు అంత్యక్రియలు నిర్వహించారు.

కుటుంబాన్ని అభినందించిన ప్రతినిధులు..



విషాదంలో కూడా ఒక ఆంధునికి చూపును ప్రసాదించడానికి రాయపోషం ఒక కంటి కార్నియాను దానం చేసిన కుటుంబ సభ్యులను నగర మేయర్ మహంకాళి స్వామి, డిప్యూటీ మేయర్ పాతిపెల్లి ఎల్లయ్య, మున్సిపల్ కమిషనర్ అరుణశ్రీ, ఎస్టాబ్లిష్మెంట్ సూపరింటెండెంట్ పబ్బాలా శ్రీనివాస్, సదాశయ ఫౌండేషన్ జాతీయ అధ్యక్షుడు శ్రవణ్ కుమార్, కార్యదర్శి లింగమూర్తి, ప్రతినిధులు సానా రామకృష్ణా రెడ్డి, నూక రమేష్, మారెల్లి రాజిరెడ్డి, లగిశెట్టి చంద్రమౌళి, భీష్మాచారి, కే ఎస్ వాసు, వెల్ది కవిత అనంతరాములు తోపాటు లయన్స్ క్లబ్ ప్రతినిధులు ఎల్లప్ప, సారయ్య, రాజేంద్ర కుమార్, ముద్దసాని ప్రమోద్ కుమార్ రెడ్డి, పి.మల్లికార్జున్, కజాంపురం జయప్రద రాజేందర్ తదితరులు అభినందించారు. ఆయన అకాల మరణం పట్ల ప్రగాఢ సంతాపాన్ని, సానుభూతిని వ్యక్తం చేశారు.

# ట్రాఫిక్ చలాన్లపై తెలంగాణ సర్కార్ కొరడా



## ఇకపై కఠిన చర్యలు


హైదరాబాద్: తెలంగాణలో వాహన దారులకు ఇది ముఖ్యమైన హెచ్చరిక. ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘించి, పెండింగ్ చలాన్లను చెల్లించకుండా నిర్లక్ష్యం వహిస్తే ఇకపై తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుంది. పదేపదే నిబంధనలు అతిక్రమించినా, జరిమానాలు కట్టకపోయినా వాహన రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ (ఆర్సీ), డ్రైవింగ్ లైసెన్స్ (డీఎల్) స్తంభింపజేసే (ఫ్రీజ్) కఠిన నిబంధనలను అమలు చేసేందుకు రవాణా శాఖ సిద్ధమవుతోంది. పెండింగ్ చలాన్ల వసూలు, వాటిపై వచ్చే వివాదాల పరిష్కారం కోసం ప్రభుత్వం విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టింది.

ఆన్‌లైన్‌లోనే ఫిర్యాదుల పరిష్కారం : కేంద్ర మోటార్ వాహన నిబంధనలకు అనుగుణంగా జరిమానాలపై వచ్చే అభ్యంతరాలను పారదర్శకంగా, వేగంగా పరిష్కరించేందుకు 'గ్రీవెన్స్ రెడ్రెసల్ అథారిటీ'ని ఏర్పాటు చేయనున్నారు. దీనికి సంబంధించిన ప్రాథమిక నోటిఫికేషన్ త్వరలో వెలువడనున్నట్లు సమాచారం. ఈ కొత్త విధానంలో వాహనదారులు తమ ఫిర్యాదులను కేవలం ఆన్‌లైన్ పోర్టల్ ద్వారానే నమోదు చేయాలి. సాంకేతిక లోపాలు, డేటా ఎంట్రీ పొరపాట్లు, వాహనం అమ్మిన తర్వాత వచ్చే తప్పుడు చలాన్ల వంటి సమస్యలను పోలీసు, రవాణా శాఖలకు చెందిన ఉన్నతాధికారులు నిర్దేశిత గడువులోగా పరిష్కరిస్తారు. హైదరాబాద్, సైబరాబాద్ వంటి కమిషనరేట్లలో ట్రాఫిక్ డీసీపీలు, ఇతర జిల్లాల్లో ఎస్పీలు, రవాణా శాఖలో ఆర్టీవోలు గ్రీవెన్స్ అధికారులుగా వ్యవహరిస్తారు.

స్పష్టమైన కాలపరిమితులు : చలాన్ల జారీ నుంచి పరిష్కారం వరకు ప్రభుత్వం స్పష్టమైన కాలపరిమితులను నిర్దేశించింది. కెమెరా ఆధారిత చలాన్‌ను 3 రోజుల్లో, మాన్యువల్ చలాన్‌ను 15 రోజుల్లోగా పంపాలి. చలాన్ అందిన 45 రోజుల్లో వాహనదారుడు జరిమానా కట్టాలి లేదా ఆన్‌లైన్‌లో అభ్యంతరం తెలపాలి. ఫిర్యాదు అందిన 30 రోజుల్లోగా అధికారులు తమ నిర్ణయం వెల్లడించాలి. అధికారుల నిర్ణయంపై అసంతృప్తిగా ఉంటే, చలాన్ మొత్తంలో 50 శాతం చెల్లించి కోర్టును ఆశ్రయించే అవకాశం కల్పించారు.

ఈ విధానంలో అత్యంత కీలకమైన అంశం ఏమిటంటే, ఒక వాహనంపై ఏడాదిలో 5కంటే ఎక్కువచలాన్లు పెండిం గ్‌లో ఉంటే, ఆసమాచారం నేరుగా రవాణా శాఖకు వెళ్తుంది. వెంటనే సంబంధిత వ్యక్తి డ్రైవింగ్ లైసెన్స్ లేదా వాహన ఆర్సీని అధికారులు బ్లాక్ చేస్తారు. ఇలా బ్లాక్ అయిన తర్వాత ఆ వాహనానికి సంబం ధించిన ఫిట్‌నెస్, యాజమాన్య బదిలీ వంటి ఏ ఆర్టీఏ సేవలు పొంద దంసాధ్యంకాదు. పెండింగ్‌లోఉన్నచలాన్లన్నీ పూర్తిగాచెల్లించిన తర్వాతే ఈ సేవలను తిరిగి పునరుద్ధరిస్తారు. ఈ కఠిన నిబంధనల ద్వారా వాహనదారుల్లో బాధ్యతను పెంచడంతో పాటు, రాష్ట్రంలో రహదారి భద్రతను మెరుగుపరచాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది.

# ఆసిఫాబాద్ జిల్లాలో యువతుల అక్రమ రవాణా ముఠా గుట్టు రట్టు



కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా : కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా బెజ్జూరు మండలంలో సాగుతున్న అమానుషమైన యువతుల అక్రమ రవాణా దందాను పోలీసులు ఛేదించారు. మారుమూల ప్రాంతాల్లోని అమాయక గిరిజన యువతులు, ఒంటరి మహిళలు మరియు వితంతువులను లక్ష్యంగా చేసుకుని ఒక ముఠా ఈ దారుణానికి ఒడిగడుతున్నట్లు విచారణలో తేలింది. నిందితులు బాధితులను నమ్మించి, బలవంతంగా నిర్బంధించి, ఒక్కొక్కరిని సుమారు రూ. 2.50 లక్షలకు ఇతర రాష్ట్రాలకు విక్రయిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. తక్కువ సమయంలో ఎక్కువ డబ్బు సంపాదించాలనే ఆశతో ఈ ముఠా గత కొంతకాలంగా ఈ నెట్వర్క్‌ను నడుపుతున్నట్లు వెల్లడైంది. పోలీసుల కథనం ప్రకారం, ఈ ముఠా మహిళలను మధ్యప్రదేశ్, రాజస్థాన్, పంజాబ్ వంటి ఉత్తరాది రాష్ట్రాలకు తరలిస్తోంది. అక్కడ ఉన్న హై క్లాస్ కుటుంబాలకు చెందిన పురుషులతో వీరికి బలవంతంగా పెళ్లిళ్లు చేయడమే కాకుండా, మరికొందరిని వ్యభిచార గృహాలకు విక్రయిస్తున్నట్లు విస్తుపోయే నిజాలు వెలుగులోకి వచ్చాయి. అక్రమంగా యువతులను తరలిస్తున్నారనే సమాచారంతో నిఘా పెట్టిన పోలీసులు, సరిహద్దు దాటుతుండగా ఈ ముఠాను పట్టుకున్నారు. నిందితులపై కఠిన కేసులు నమోదు చేసి, ఈ నెట్వర్క్‌లో ఇంకా ఎవరెవరు ఉన్నారనే కోణంలో లోతైన దర్యాప్తు జరుపుతున్నారు.

# తొలి దశలో 46 కిలోమీటర్ల వైజాగ్ మెట్రో

విశాఖపట్టణం, : విశాఖ మెట్రో రైలు నిర్మాణంపై మంత్రి నారాయణ కీలక ప్రకటన చేశారు. విశాఖ మెట్రోకు త్వరలోనే కేంద్రం నుంచి అనుమతులు రానున్నట్లు తెలిపారు. 3 ఏళ్లలో వైజాగ్ మెట్రోను పూర్తి చేస్తామని తెలిపారు. తొలి దశలో 46.23 కిలోమీటర్ల మేర నిర్మించనున్నారు. అదే సమయంలో విశాఖలో సెమీ రింగ్ రోడ్డు నిర్మించనున్నట్లు వెల్లడించారు. అటు.. విజయవాడ మెట్రో నిర్మాణంపైనా మంత్రి కీలక వ్యాఖ్యలు చేశారు. ఆంధ్రప్రదేశ్ ఐటీ రాజధాని అయిన విశాఖపట్నం శరవేగంగా అభివృద్ధి చెందుతోంది. అంతర్జాతీయ కంపెనీలు విశాఖకు వస్తుండటంతో.. అందుకు తగ్గట్లు రాష్ట్ర ప్రభుత్వం మౌలిక వసతుల కల్పన చేస్తోంది. అందులో భాగంగానే విశాఖలో మెట్రో, సెమీ రింగ్ రోడ్డు, నగర రోడ్లకు సంబంధించిన పనులపై దృష్టి పెట్టింది. ఈ నేపథ్యంలోనే విశాఖ మెట్రో రైలు ప్రాజెక్టుకు సంబంధించి.. ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ బిగ్ అప్‌డేట్ ఇచ్చారు. రెండు, మూడు రోజుల్లోనే కేంద్ర ప్రభుత్వం నుంచి విశాఖ మెట్రో ప్రాజెక్టుకు అనుమతులు రానున్నట్లు తెలిపారు. విశాఖపట్నం మెట్రో ప్రాజెక్ట్ ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వ పరిశీలనలో ఉందని మంత్రి నారాయణ స్పష్టం చేశారు. విశాఖ మెట్రో ప్రాజెక్టుపై రైడర్స్ సంస్థ అధ్యయనం చేస్తోందని వివరించారు. ఆ సంస్థ అధ్యయనం 2 నెలల్లో పూర్తి అయ్యే అవకాశాలు ఉన్నాయని తెలిపారు. త్వరలోనే విశాఖ మెట్రో నిర్మాణం కోసం టెండర్లను పిలవనున్నట్లు వెల్లడించారు. 3 ఏళ్లల్లో వైజాగ్ మెట్రోను పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని తమ ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకున్నట్లు స్పష్టం చేశారు. విశాఖలో పట్టణ, గృహ నిర్మాణ శాఖపై జరిగిన రీజినల్ వర్క్ షాప్‌లో పాల్గొన్న నారాయణ.. ఈ వ్యాఖ్యలు చేశారు. తొలి దశ విశాఖ మెట్రో నిర్మాణంలో భాగంగా వైజాగ్ స్టీల్ ప్లాంట్ నుంచి కొమ్మాది వరకు మొత్తంగా 46.23 కిలోమీటర్ల మేర నిర్మాణం చేపట్టనున్నారు. ఈ తొలి దశలో 3 కారిడార్లు ఏర్పాటు చేయనున్నారు. విశాఖ స్టీల్ ప్లాంట్ నుంచి కొమ్మాది వరకు ఒక కారిడార్.. ఓల్డ్ పోస్టాఫీస్ నుంచి గురుద్వారా వరకు రెండో కారిడార్.. చినవాల్తేరు నుంచి తాటిచెట్లపాలెం వరకు మూడో కారిడార్ నిర్మించనున్నారు. ఈ 46.23 కిలోమీటర్ల మార్గంలో.. 20.16 కిలోమీటర్ల మేర డబుల్ డెక్కర్ విధానంలో మెట్రో రైలు మార్గాన్ని నిర్మించనున్నారు. అంటే దాదాపు సగం మార్గం డబుల్ డెక్కర్ విధానంలోనే ఉండనుంది. మరోవైపు.. విశాఖ మెట్రో ప్రాజెక్టుకు కేంద్రం అనుమతులు ఇవ్వగా.. డీటెయిల్డ్ ప్రాజెక్టు రిపోర్ట్ (డీపీఆర్)ను తయారు చేయడానికి కేంద్రం నుంచి అనుమతి రావాల్సి ఉంది. ఈ నేపథ్యంలోనే విశాఖ మెట్రో డీపీఆర్‌కు త్వరలోనే కేంద్రం



నుంచి అనుమతులు రానున్నాయి. ఆ తర్వాత టెండర్లు పిలిచి పనులు ప్రారంభించనున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి సంయుక్తంగా ఈ విశాఖ మెట్రో నిర్మాణాన్ని చేపట్టనున్నాయి. ఇందులో కేంద్ర ప్రభుత్వం తన వాటాగా కొంత మొత్తాన్ని కేటాయించేందుకు అంగీకరించింది. తమ ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకున్నట్లు స్పష్టం చేశారు. విశాఖలో పట్టణ, గృహ నిర్మాణ శాఖపై జరిగిన రీజినల్ వర్క్ షాప్‌లో పాల్గొన్న నారాయణ.. ఈ వ్యాఖ్యలు చేశారు. తొలి దశ విశాఖ మెట్రో నిర్మాణంలో భాగంగా వైజాగ్ స్టీల్ ప్లాంట్ నుంచి కొమ్మాది వరకు మొత్తంగా 46.23 కిలోమీటర్ల మేర నిర్మాణం చేపట్టనున్నారు. ఈ తొలి దశలో 3 కారిడార్లు ఏర్పాటు చేయనున్నారు. విశాఖ స్టీల్ ప్లాంట్ నుంచి కొమ్మాది వరకుమరోవైపు.. విజయవాడ మెట్రోకు కూడా కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం అనుమతులు ఇచ్చిన సంగతి తెలిసిందే. విజయవాడ మెట్రోకు త్వరలోనే సర్వే చేపట్టనుండగా.. ఆ తర్వాత డీపీఆర్‌ను తయారు చేసి ఆమోదం కోసం కేంద్ర ప్రభుత్వానికి పంపించనున్నారు. మరోవైపు.. హైదరాబాద్‌లోని ఔటర్ రింగ్ రోడ్డు (ఓఆర్ఆర్) లాగానే విశాఖపట్నంలో కూడా సెమీ రింగ్ రోడ్డు నిర్మాణం చేపడతామని మంత్రి నారాయణ స్పష్టం చేశారు. ఈ సెమీ రింగ్ రోడ్డు నిర్మాణం పూర్తి అయితే విశాఖలో ట్రాఫిక్ భారీగా తగ్గుతుందని పేర్కొన్నారు. సెమీ రింగ్ రోడ్డు నిర్మాణానికి సంబంధించి వీఎంఆర్డీఏ అధ్యయనం చేస్తోందని.. విశాఖ అభివృద్ధి కోసం హడ్కో సహకారం ముఖ్యమని మంత్రి తెలిపారు. కార్పొరేషన్లు, మున్సిపాలిటీలకు ఆదాయాన్ని సమకూర్చుకునే మార్గాలను అన్వేషించనున్నట్లు పేర్కొన్నారు. రాంబిల్లి–భోగాపురం ప్రాజెక్టును వీఎంఆర్‌డీఏ పరిశీలిస్తోందని తెలిపిన మంత్రి నారాయణ.. మాస్టర్‌ప్లాన్ రోడ్డులో ఒక రోడ్డుకు అటవీ భూమి అడ్డుగా ఉందని వెల్లడించారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు.. డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌లను కలిసి మాట్లాడి సమస్యను పరిష్కరించనున్నట్లు స్పష్టం చేశారు.

# అధికార పార్టీకి దొరికిన అస్త్రం..!

రంగారెడ్డి, : డ్రగ్స్ కేసు రాజకీయ పేలుళ్లకు కారణం అవుతోంది. ఏపీలో ఎంపీ మహేష్‌ను పార్టీ వ్యవహారాలకు దూరంగా ఉండాలని టీడీపీ ఆదేశించింది. వెంటనే చర్యలు తీసుకుంది. అయితే పైలట్ రోహిత్ రెడ్డి విషయంలో బీఆర్ఎస్ ఆలోచిస్తోంది. అదే సమయంలో కాంగ్రెస్ వెంటనే కేటీఆర్ ను టార్గెట్ చేసింది. ఆయనతో వైట్ చాలెంజ్ విసురుతోంది. కేటీఆర్ కూడా రివర్స్ చాలెంజ్ విసిరారు. అసెంబ్లీ సమాశాల్లోనూ ఇది హాట్ టాపిక్ అయ్యే అవకాశం ఉంది. గతంలోనూ డ్రగ్స్ అంశం రాజకీయంగా కీలకంగా మారింది. ఇప్పుడు మరోసారి అదే అంశం హాట్ టాపిక్ అయ్యే అవకాశాలు ఉన్నాయి. మొయినాబాద్ డ్రగ్స్ ఉదంతం కేవలం ఒక క్రైమ్ ఇన్సిడెంట్‌గా మిగిలిపోకుండా, తెలుగు రాష్ట్రాల్లో పెను రాజకీయ ప్రకంపనలు సృష్టిస్తోంది. ఈ కేసులో వెలుగులోకి వచ్చిన పేర్లు, ఆపై జరిగిన పరిణామాలు అధికార, ప్రతిపక్షాల మధ్య మాటల యుద్ధానికి కేంద్రబిందువుగా మారాయి. డ్రగ్స్ కేసును అస్త్రంగా చేసుకుని రాజకీయంగా పైచేయి సాధించేందుకు అటు ఏపీలోనూ, ఇటు తెలంగాణలోనూ పార్టీలు వ్యూహాలకు పదును పెడుతున్నాయి. ఆంధ్రప్రదేశ్‌లో డ్రగ్స్ కేసు ప్రకంపనలు రాగానే టీడీపీ అధిష్టానం అత్యంత వేగంగా స్పందించడం చర్చనీయాం శమైంది. ఈ వ్యవహారంలో ఆరోపణలు ఎదుర్కొంటున్న ఎంపీ పుట్టా మహేష్ యాదవ్‌ను పార్టీ కార్యకలాపాలకు దూరంగా ఉండాలని ఆదేశించింది తప్పు ఎవరిదైనా సరే, క్రమశిక్షణ విషయంలో రాజీ పడబోం అనే సంకేతాలను ప్రజల్లోకి పంపడం ద్వారా ప్రభుత్వం నైతిక విజయాన్ని సాధించే ప్రయత్నం చేస్తోంది. అధికారంలో ఉన్న పార్టీగా ఇలాంటి నిర్ణయం తీసుకోవడం ద్వారా విపక్షాల నోళ్లు నొక్కేయవచ్చని టీడీపీ భావిస్తోంది. తెలంగాణలో పరిస్థితి మరోలా ఉంది. ఫామ్‌హౌస్ పార్టీలో రోహిత్ రెడ్డి పేరు వినిపించడం బీఆర్ఎస్‌ను ఇరకాటంలోకి నెట్టింది. పార్టీకి కీలక నేత కావడంతో బీఆర్ఎస్ అధిష్టానం చర్యల విషయంలో ఆచితూచి వ్యవహరిస్తోంది. గతంలోనూ పలుమార్లు డ్రగ్స్ ఇష్యూస్ బీఆర్ఎస్ నేతల చుట్టూ తిరిగినప్పటికీ, ప్రస్తుత పరిస్థితుల్లో ఇది పార్టీ ప్రతిష్టను దెబ్బతీస్తుందనే ఆందోళన వ్యక్తమవుతోంది. రోహిత్ రెడ్డి విషయంలో వేచి చూసే ధోరణి అవలంబించడం వల్ల ప్రతిపక్షాలకు విమర్శలు చేసేందుకు అవకాశం ఇచ్చినట్లయింది. తెలంగాణ అధికార పార్టీ కాంగ్రెస్ ఈ అవకాశాన్ని అస్సలు వదులుకోవడం లేదు. గతంలో రేవంత్ రెడ్డి విసిరిన వైట్ ఛాలెంజ్‌ను ఇప్పుడు మళ్ళీ తెరపైకి తెచ్చారు. కేటీఆర్‌ను టార్గెట్ చేస్తూ కాంగ్రెస్ నేతలు డ్రగ్స్ టెస్టులకు సిద్ధమా అని సవాల్ విసురుతున్నారు. దీనికి ప్రతిగా కేటీఆర్ కూడా రివర్స్ ఛాలెంజ్ విసరడం, నాటి కేసుల ప్రస్తావన తీసుకురావడంతో రాజకీయం మరింత హీటెక్కింది. రాష్ట్రంలో డ్రగ్ ఫ్రీ తెలంగాణ నినాదాన్ని వినిపిస్తున్న కాంగ్రెస్, ఈ కేసు ద్వారా బీఆర్ఎస్ ముసుగు తొలగిస్తామన్నట్లుగా వ్యవహరిస్తోంది. తెలంగాణ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో ఈ డ్రగ్స్ ఇష్యూ ప్రధాన అస్త్రంగా మారే అవకాశం ఉంది. ప్రజాప్రతినిధులు డ్రగ్స్ పార్టీల్లో పాల్గొనడం, అందులో గన్ కల్చర్ చోటుచేసుకోవడం తెలుగు రాష్ట్రాల్లో డ్రగ్స్ అంశం రాజకీయంగా కీలకం కావడం ఇదే మొదటిసారి కాదు. గతంలో జరిగిన టాలీవుడ్ డ్రగ్స్ కేసు, కొకైన్ స్కామ్స్ ఎన్నికల సమయంలో ఎంతో ప్రభావం చూపాయి. ఇప్పుడు మొయినాబాద్ కేసు ద్వారా మరోసారి అదే తరహా సెన్సేషన్ మొదలైంది. ఇది కేవలం ఒక పార్టీకే పరిమితం కాకుండా, అందరి చుట్టూ తిరుగుతుండటంతో రాబోయే రోజుల్లో రాజకీయ సమీకరణలు ఏ మలుపు తిరుగుతాయోనన్న ఆసక్తి నెలకొంది.

# నిరుద్యోగ యువతీ యువకులకు స్టాఫ్ సెలక్షన్ కమిషన్ ఉద్యోగాలకు ఉచిత శిక్షణ

## – పెన్నం సుధాకర్

ఆళ్లగడ్డ : ఆళ్లగడ్డలో ఎస్సీ ఎస్టీ మైనార్టీల నిరుద్యోగ యువతకు 18 సంవత్సరాల నుండి 23 సంవత్సరాల వయస్సు గల వారు ప్రస్తుతము వెలుబడిన 25 వేల 487 ఉద్యోగాలకు (సెంట్రల్ గవర్నమెంట్ ) స్టాఫ్ సెలక్షన్ కమిషన్‌ఉద్యోగాలకుశిక్షణ నిమిత్తం ఎస్సీ ఎస్టీ మైనార్టీల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పెన్నం సుధాకర్ గారు నాదెండ్ల కరుణాకర్ విలేకరులతో మాట్లాడుతూ ఆళ్లగడ్డ గ్రామీణ ప్రాంతాలలో 10 వ తరగతి ఇంటర్ చదువులు పూర్తిచేసుకుని 18 సంవత్సరాల నిండిన 23 సంవత్సరాల లోపు యువతి యువకులకు ఉచితముగా శిక్షణ తరగతులను నిర్వహించేందుకు ఆర్ ఆర్ అకాడమీ నిర్వాహకులు మర్రెడ్డి శ్రీనివాస్ రెడ్డి గారు ఎస్విఎన్ హరి ప్రసాద్, కోచ్ డిపి సుబ్బారాయుడు సుధాకర్ గారు అన్నారు

# ప్రపంచ ఆర్థిక మాంద్యం ముప్పు




న్యూఢిల్లీ : పశ్చిమాసియాలో నెలకొన్న యుద్ధ సంక్షోభం ప్రపంచ ఆర్థిక మాంద్యానికి దారి తీయనుందని యాక్సిస్ బ్యాంక్ చీఫ్ ఎకనామిస్ట్, యాక్సిస్ కాపిటల్ గ్లోబల్ రీసెర్చ్ హెడ్ నీలకంఠ మిశ్రా హెచ్చరించారు. ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయిల్ కొనసాగిస్తోన్న ఉద్రిక్తతలు వచ్చే నాలుగు వారాల పాటు ఇలాగే కొనసాగితే ప్రపంచ ఆర్థిక వ్యవస్థ తీవ్రమైన మాంద్యంలోకి వెళ్లే ప్రమాదం ఉందన్నారు. ఓ మీడియా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుతం ప్రపంచ ఇంధన సరఫరాలో దాదాపు 7 శాతం మేర అంతరాయం ఏర్పడిందని వెల్లడించారు. ఇది కేవలం చమురు ధరల పెరుగుదల మాత్రమే కాకుండా నేరుగా ఇంధన కొరతకు దారితీస్తోందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఇంధన సరఫరాలో 4 శాతం నుండి 5 శాతం మేర అంతరాయం కలిగితేనే ప్రపంచ జిడిపిలోనూ 4 నుంచి 5 శాతం కోత పడే అవకాశం ఉందన్నారు. ప్రస్తుతానికి కంపెనీల వద్ద ఉన్న నిల్వలకారణంగా అంతర్జాతీయ మార్కెట్లు కొంత స్థిరంగా ఉన్నప్పటికీ సరఫరా గొలుసులో ఇబ్బందులు రోజురోజుకూ తీవ్రమవుతున్నాయని మిశ్రా పేర్కొన్నారు. ఇప్పటికే రియల్ ఎస్టేట్, వాహన తయారీ రంగాలు కీలక ముడిసరుకుల కొరతను ఎదుర్కొంటున్నాయని ఆయన గుర్తు చేశారు. గ్యాస్ కొరతతో సూరత్ టెక్స్‌టైల్ రంగంలో ఇబ్బందులు నెలకొన్నాయన్నారు. వివరించారు. ఆర్థిక నష్టం విపరీతంగా పెరిగి అంతర్జాతీయ ఆర్థిక మార్కెట్ల నుండి ఒత్తిడి పెరిగినప్పుడే యుద్ధంలో పాల్గొంటున్న దేశాలు వెనక్కి తగ్గే అవకాశం ఉందని మిశ్రా అభిప్రాయపడ్డారు. ఈ సంక్షోభం వల్ల కలిగే ఆర్థిక భారంతో అన్ని దేశాలు నష్టపోతాయని హెచ్చరించారు. అందుకే ఈ యుద్ధం సుదీర్ఘ కాలం కొనసాగకపోవచ్చని ఆయన అంచనా వేశారు. అయితే, కీలకమైన ఇంధన మౌలిక సదుపాయాలకు ఏదైనా నష్టం వాటిల్లితే మాత్రం పరిస్థితి మరింత దిగజారి

# మెడికల్ కాలేజీలో అంతుచిక్కని మరణాలు..

## ఏడాది తర్వాత ఓటీటీలోకి వచ్చేసిన హారర్ క్రైమ్ థ్రిల్లర్






సాధారణంగా థియేటర్లలో విడుదలైన సినిమాలు మూడు లేదా నాలుగు వారాల తర్వాత ఓటీటీలోకి వచ్చేస్తుంటాయి. కొన్ని బ్లాక్ బస్టర్ సినిమాలు అయితే ఐదు లేదా ఆరువారాలకు స్ట్రీమింగ్ కు వస్తుంటాయి. రవితేజ నటించిన భర్త మహాశయులకు విజ్ఞప్తి వంటి కొన్ని సినిమాలు రెండు నెలల తర్వాత ఓటీటీలో సందడి చేస్తుంటాయి. అయితే తెలుగు హారర్ థ్రిల్లర్ సినిమా మాత్రం ఏకంగా ఏడాది తర్వాత ఓటీటీలోకి వచ్చేసింది. గతేడాది ఫిబ్రవరిలో తెలుగు, తమిళ భాషల్లో రిలీజ్ అయిన ఈ చిత్రం ఆడియెన్స్ ను బాగా భయపెట్టింది. ముఖ్యంగా ఈ సినిమాలో డిఫరెంట్ శబ్దాలు, బీజీఎమ్ తో అందరినీ భయపెట్టారు. అలాగే ఇప్పటివరకు ఏ సినిమాలోనూ చూపించని సరికొత్త పాయింట్ ను ఇందులో చూపించారు. ఈ సినిమా కథ విషయానికి వస్తే.. మున్నార్‌లోని ఒక మెడికల్ కళాశాల చుట్టూ ఈ సినిమా కథ తిరుగుతుంది. ఈ కాలేజీలో వరుస మరణాలు చోటు చేసుకుంటాయి. విద్యార్థులు వరుసగా ఆత్మహత్యలకు పాల్పడుతుంటారు. అంతేకాదు మృతదేహాలపై చిత్ర విచిత్రమైన మార్కులు కనిపిస్తుంటాయి. దీంతో కాలేజీలో ఏదో ఉందని అందరూ అనుమానిస్తారు. అప్పుడే ఈ మిస్టరీని కనిపెట్టేందుకు రూబాన్ అనే ఒక ప్రొఫెషనల్ ఘోస్ట్ హంటర్ ను కాలేజీకి పిలిపిస్తారు. అతను కొన్ని సైంటిఫిక్ టూల్స్ ఉపయోగించి ఆత్మలను ట్రాక్ చేస్తాడు. అదే సమయంలో కాలేజీలో విద్యార్థుల మరణాల వెనక కొన్ని షాకింగ్ సీక్రెట్స్ ఉన్నాయని తెలుసుకుంటాడు. ఒక వింత శబ్దం వల్లనే స్టూడెంట్స్ చనిపోతున్నా రని అర్థం చేసుకుంటాడు. ఇదే క్రమంలో కాలేజీ గత చరిత్ర గురించి తెలుసుకునే క్రమంలో షాకింగ్ నిజాలు వెలుగులోకి వస్తాయి.. 20 ఏళ్ల క్రితం ఇదే కాలేజీలో ఒక మ్యూజిక్ టీచర్ అనుమానాస్పదంగా చనిపోయిందని రుబాన్ తెలుసుకుంటారు. ఆమె మరణం వెనక కాలేజీ స్టాఫ్ ఉంటారని తెలుసుకుంటాడు. మరి రూబాన్ ఆ మ్యూజిక టీచర్ ఆత్మను ఎలా అడ్డుకున్నాడు? విద్యార్థుల వరుస మరణాలను ఎలా ఆపగలిగాడు? అసలు ఆ మ్యూజిక్ టీచర కథేంటి? చివరకు ఏమైంది? అన్నది తెలుసుకోవలంటే ఈ సినిమా చూడాల్సిందే.

# ఇక సారీలు చెప్పడం ఆపాలి

## ఇండస్ట్రీలో మహిళల పరిస్థితిపై సమంత సంచలన వ్యాఖ్యలు



స్టార్ హీరోయిన్ సమంత రూత్ ప్రభు సినీ పరిశ్రమలో మహిళలు ఎదుర్కొంటున్న సవాళ్లపై చేసిన వ్యాఖ్యలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ది హాలీవుడ్ రిపోర్టర్ ఇండియా నిర్వహించిన ఒక కార్యక్రమంలో పాల్గొన్న సమంత, మహిళల స్థితిగతులపై తన మనసులోని భావాలను బహిరంగంగా వెల్లడించింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, తమ గుర్తింపు కోసం మహిళలు ప్రతిదానికీ రెట్టింపు కష్టపడాల్సి వస్తోంది అని పేర్కొంది. సినిమా రంగంలో మహిళలు ఎదుర్కొనే ఇబ్బందులను వివరంగా చెబుతూ, వారి పోరాటం ఎంత కఠినంగా ఉంటుందో వెల్లడించింది. సమాజంలో ఇతరులు సౌకర్యంగా ఉండటానికి మహిళలు తమ అభిప్రాయాలు, షెడ్యూళ్లను ఎప్పటికప్పుడు మార్చుకుంటూ ఉంటారని సమంత ఆవేదన వ్యక్తం చేసింది. తమ ఆశయాలను వదులుకుంటూ వెనక్కి తగ్గడం మహిళలకు అలవాటైపోయింది అని ఆమె అన్నారు. ఇంకా ముందుకు వెళ్లి, మహిళలు తమ త్యాగాలను కూడా గుర్తించకుండా జీవిస్తున్నారని సమంత పేర్కొంది. “తమ వ్యక్తిత్వాన్ని త్యాగం చేసి, ఇతరుల కోసం జీవించడం ఒక సాధారణ విషయంగా మారిపోయింది అని ఆమె అభిప్రాయపడింది. పురుషుల కంటే మహిళలు ఎక్కువగా క్షమాపణలు చెబుతారని చెప్పిన సమంత, ప్రతిదానికీ సారీ చెప్పడం ఇకనైనా ఆపాలి” అంటూ గట్టిగా పిలుపునిచ్చింది. మహిళలు తమ స్థానాన్ని అర్హతతో సంపాదించుకున్నారని, అందుకే ఎవరో ప్రశంసించినప్పుడు దాన్ని గర్వంగా స్వీకరించాలని సూచించింది. భవిష్యత్తుపై తన ఆశయాన్ని వ్యక్తం చేస్తూ, సినిమాలను ‘ఫీమేల్ లీడ్’ అంటూ ప్రత్యేకంగా ట్యాగ్ చేయాల్సిన అవసరం లేని రోజు రావాలని ఆమె ఆకాంక్షించింది. “మహిళా పాత్రలు కేవలం హీరోకు సపోర్ట్ చేసే స్థాయిలో కాకుండా, స్వతంత్రంగా నిలబడాలి” అని స్పష్టం చేసింది. షూటింగ్ సెట్స్‌లో భద్రతపై కూడా సమంత దృష్టి సారించింది. అది ఒక చర్చాంశం కాకుండా పరిశ్రమకు ప్రాథమిక ప్రమాణంగా మారాలని, ప్రతి మహిళా నటి సెట్‌లో సురక్షితంగా ఉన్నామనే భావనతో పని చేయాలని ఆమె పేర్కొంది.

## నెట్టింట సాయి పల్లవి పెళ్లి రూమర్స్ .. ఇప్పట్లో చేసుకునే ప్రసక్తే లేదంటున్న లేడీ పవర్ స్టార్

దక్షిణాది సినీ పరిశ్రమలో సహజ నటనతో ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్న స్టార్ హీరోయిన్ సాయి పల్లవి మరోసారి వార్తల్లో నిలిచారు. డ్యాన్స్ షోల నుంచి సినీ ప్రపంచంలోకి అడుగుపెట్టి, తన టాలెంట్‌తో టాప్ హీరోయిన్‌గా ఎదిగిన ఆమె ప్రయాణం నిజంగా స్ఫూర్తిదాయకం. చిన్నప్పటి నుంచే నాట్యం, నటనపై ఆసక్తి ఉన్నప్పటికీ చదువును ప్రాధాన్యంగా తీసుకుని మెడికల్ డిగ్రీ పూర్తి చేసిన సాయి పల్లవి, ప్రేమమ్ సినిమాలో ‘మలర్ టీచర్’ పాత్రతో ప్రేక్షకులను ఆకట్టుకుంది. ఆ తర్వాత ఫిదా సినిమాతో తెలుగు ప్రేక్షకులకు మరింత దగ్గరై, తన సహజ నటన, తెలంగాణ యాసతో కుర్రకారును మెస్మరైజ్ చేసింది. దీంతో ఆమెకు ‘లేడీ పవర్ స్టార్’ అనే ట్యాగ్ కూడా వచ్చింది.ప్రస్తుతం ఆమె కెరీర్ పీక్‌లో ఉంది. బాలీవుడ్‌లో జునైద్ ఖాన్ తో కలిసి ఓ సినిమాతో ఎంట్రీ ఇస్తుండగా, ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్ రామాయణం లో సీత పాత్ర పోషించడం మరింత ఆసక్తిని రేకెత్తిస్తోంది. అలాగే తమిళంలో ధనుష్ సరసన కూడా ఓ భారీ చిత్రంలో నటిస్తూ బిజీగా ఉంది. ఇదిలా ఉంటే, ఇటీవల ఆమె పెళ్లిపై వస్తున్న రూమర్లకు తానే స్వయంగా ఫుల్‌స్టాప్ పెట్టింది. ఒక కార్యక్రమంలో మీడియా అడిగిన ప్రశ్నకు స్పందిస్తూ సాయి పల్లవి స్పష్టంగా తన అభిప్రాయం వెల్లడించింది. “ప్రస్తుతం నా పూర్తి దృష్టి కెరీర్‌పైనే ఉంది. పెళ్లి గురించి ఇప్పట్లో ఎలాంటి ఆలోచన లేదు. నేను ప్రస్తుతం సింగిల్‌గానే ఉన్నాను” అని చెప్పి అందరికీ క్లారిటీ ఇచ్చింది.సాధారణంగా ఇలాంటి ప్రశ్నలకు స్టార్ హీరోయిన్లు ఊహించని సమాధానాలు ఇస్తుంటారు. కానీ సాయి పల్లవి మాత్రం ఎలాంటి సందేహాలకు తావు లేకుండా సూటిగా చెప్పడం అభిమానులను ఆకట్టుకుంది. ఇక ఆమె పెళ్లి విషయంపై సోషల్ మీడియాలో విభిన్న స్పందనలు వ్యక్తమవుతున్నాయి. కొందరు ఫ్యాన్స్ ఆమె నిర్ణయాన్ని సమర్థిస్తుంటే, మరికొందరు మాత్రం ఆమె పెళ్లి వార్త కోసం ఎదురుచూస్తున్నారు. ఏదేమైన పెళ్లి కంటే కెరీర్‌నే ప్రాధాన్యంగా తీసుకుంటూ ముందుకు సాగుతున్న సాయి పల్లవి నిర్ణయం ప్రస్తుతం ఇండస్ట్రీలో హాట్ టాపిక్‌గా మారింది.




# బైకులపై ఆసక్తి పెరుగుతూ వచ్చింది



సీనియర్ నటుడు డాక్టర్ రాజశేఖర్, తన భార్య జీవిత గురించి ఓ సరదా విషయాన్ని మీడియా ముందు పంచుకున్నారు. తనకు ఎంతో ఇష్టమైన బైక్‌ను, తనకు తెలియకుండానే జీవిత అమ్మేశారని ఆయన నవ్వుతూ చెప్పారు. శర్వానంద్ హీరోగా ‘బైకర్’ సినిమా నిన్న హైదరాబాద్‌లో జరిగిన ప్రెస్‌మీ ట్‌లో ఈ ఆసక్తికర సంఘటనను ఆయన వెల్లడించారు. బైక్స్ అంటే తనకెంత ఇష్టమో వివరిస్తూ, చిన్నప్పటి నుంచి తనకు బైక్స్ అంటే చాలా ఇష్టమని, అమ్మమ్మగారింట్లో బుల్లెట్‌పై ఊరంతా తిరిగేవాడినని ఆయన గుర్తుచేసుకున్నారు. తనకు వయసుతో పాటు బైకులపై కూడా ఆసక్తి పెరుగుతూ వచ్చిందన్నారు. ఆ క్రమంలోనే శేషు సినిమా సమయంలో షూటింగ్ కోసం తాను స్వయంగా యమహా 650 బైక్‌ను కొనుగోలు చేశానని. ఆ తర్వాత కూడా దాన్నే కొన్నాళ్లు నడిపానని చెప్పారు. అయితే, నేను నడిపే విధానం చూసి జీవిత ఆందోళన చెందిం దన్నారు. స్పీడ్‌గా డ్రైవ్ చేస్తున్నానని భయపడి తనకు తెలియకుండా జీవిత బైక్ అమ్మేసిందని నవ్వుతూ చెప్పారు. కాగా, ఏప్రిల్ 3న విడుదల కానున్న ‘బైకర్’ చిత్రంలో రాజశేఖర్ ‘బుల్లెట్ సునీల్’ అనే కీలక పాత్రలో నటిస్తున్నారు. భారతదేశపు మొట్టమొదటి మోటోక్రాస్ రేసింగ్ చిత్రంగా ఈ సినిమా తెరకెక్కుతోంది. ఈ సినిమాతో పాటు, తాను ‘మగాడు’ అనే మరో చిత్రంలో నటిస్తున్నానని, అలాగే తన కుమార్తె శివానితో కలిసి ఓ సినిమాలో కనిపించనున్నట్లు రాజశేఖర్ తెలిపారు.

# రామ్ చరణ్ కంటి దగ్గర అంత పెద్ద గాయమైందా..




మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ ప్రస్తుతం గ్లోబల్ స్థాయిలో తన ఇమేజ్‌ను మరింత బలపరుచుకుంటూ భారీ ప్రాజెక్టులతో బిజీగా ఉన్నారు. తర్వాత ఆయన నటిస్తున్న ప్రతి సినిమాపై అంచనాలు ఆకాశాన్ని తాకుతున్నాయి. ఈ క్రమంలోనే ‘ఉప్పెన’ ఫేమ్ దర్శకుడు బుచ్చిబాబు సానాతో కలిసి చేస్తున్న ప్రతిష్టాత్మక చిత్రం ‘పెద్ది’ ఇప్పటికే భారీ హైప్‌ను క్రియేట్ చేసింది. స్పోర్ట్స్ డ్రామా నేపథ్యంలో తెరకెక్కుతున్న ఈ చిత్రాన్నిమైత్రి మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. ఈ సినిమాకు ఆస్కార్ విజేత ఏ ఆర్ రెహమాన్ సంగీతం అందిస్తుండటం ప్రత్యేక ఆకర్షణ. ఈ సినిమాలో రామ్ చరణ్ ఒక కొత్త, రగ్గడ్ లుక్‌లో కనిపించనున్నారని సమాచారం. మొదట మార్చి 27న విడుదల కావాల్సిన ఈ చిత్రం పలు కారణాల వల్ల వాయిదా పడింది. తాజా సమాచారం ప్రకారం, ఈ సినిమాను జూన్ 26న ప్రపంచవ్యాప్తంగా రిలీజ్ చేయాలని నిర్మాతలు ప్లాన్ చేస్తున్నట్లు టాక్ వినిపిస్తోంది. మార్చి చివరి వారంలో ‘పెద్ది’ షూటింగ్ సందర్భంగా ఓ కీలక యాక్షన్ సీన్ చిత్రీకరిస్తున్న సమయంలో అనూహ్యమైన ప్రమాదం చోటుచేసుకుంది. రామ్ చరణ్ డూప్ లేకుండా స్వయంగా స్టంట్స్ చేయడానికి ప్రయత్నించే సమయంలో ఆయన కంటి పైభాగంలో గాయమైంది. వెంటనే యూనిట్ షూటింగ్ నిలిపివేసి ఆయనకు చికిత్స అందించింది. గాయం తీవ్రత దృష్ట్యా వైద్యులు నాలుగు కుట్లు వేశారు. ఈ వార్త బయటకు రాగానే అభిమానులు ఆందోళనకు గురయ్యారు. సోషల్ మీడియాలో “గెట్ వెల్ సూన్ చరణ్ అన్న” అంటూ భారీగా పోస్టులు చేశారు. అయితే, ఇది పెద్ద ప్రమాదం కాదని, చరణ్ సురక్షితంగా ఉన్నారని చిత్ర బృందం స్పష్టం చేయడంతో అభిమానులు ఊపిరి పీల్చుకున్నారు. గాయం అయినప్పటికీ రామ్ చరణ్ తన డెడికేషన్‌ను చాటుకున్నారు. వైద్యులు విశ్రాంతి తీసుకోవాలని సూచించినా, ఆయన మరుసటి రోజే సెట్స్‌కు తిరిగి వచ్చారు. కంటిపై కట్టుతోనే షూటింగ్‌లో పాల్గొనడం ఆయన కమిట్‌మెంట్‌కు నిదర్శనం. అదే సమయంలో ఆయన పుట్టినరోజు (మార్చి 27) రావడంతో సెట్స్‌లోనే బర్త్‌డే వేడుకలు జరుపుకున్నారు. గాయంతో ఉన్నప్పటికీ అభిమానులతో కలిసి కేక్ కట్ చేసి సందడి చేశారు. ప్రస్తుతం సోషల్ మీడియాలో రామ్ చరణ్ గాయంతో ఉన్న ఒక ఫోటో వైరల్ అవుతోంది. ఇందులో ఆయన ఎల్లో కలర్ డిజైనర్ శాలువాతో, రగ్గడ్ బేర్డ్ లుక్‌లో కనిపిస్తున్నారు. కంటి పైభాగంలో గాయం, కుట్లు స్పష్టంగా కనిపిస్తున్నప్పటికీ, ఆయన ముఖంలో చిరునవ్వు మాత్రం చెదరలేదు. ఈ ఫోటో చూసిన అభిమానులు ఆయన త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తున్నారు. కొద్దిరోజుల విశ్రాంతి తర్వాత రామ్ చరణ్ మళ్లీ ‘పెద్ది’ షూటింగ్‌లో పాల్గొనడానికి సిద్ధమవుతున్నట్లు సమాచారం.

## మళ్లీ రాణిగా రాబోతున్న కంగనా..

# త్వరలోనే ‘క్వీన్ 2’ షురూ!

బాలీవుడ్ ఫైర్ బ్రాండ్ కంగనా రనౌత్ కెరీర్‌లోనే మైలురాయిగా నిలిచిన చిత్రం ‘క్వీన్’. వికాస్ బల్ దర్శకత్వంలో 2013లో విడుదలైన ఈ చిత్రం బ్లాక్ బస్టర్ అందుకోవడమే కాకుండా కంగనాకు నేషనల్ అవార్డును తెచ్చిపెట్టింది. ఒక సాధారణ అమ్మాయి తన పెళ్లి రద్దయ్యాక ఒంటరిగా హనీమూన్‌కు వెళ్లి, అక్కడ తనను తాను ఎలా ఆవిష్కరించుకుంది అనే కథాంశంతో ఈ సినిమా తెరకెక్కింది. అయితే తాజాగా ఈ సూపర్ హిట్ చిత్రానికి సీక్వెల్ రాబోతున్నట్లు బాలీవుడ్ మీడియా వర్గాల నుంచి వార్తలు వస్తున్నాయి. తాజాగా రాబోతున్న ఈ సీక్వెల్‌లో కంగనా రనౌత్ మరోసారి ‘రాణి’ పాత్రలో అలరించడానికి సిద్ధమవుతున్నట్లు తెలుస్తుంది. మొదటి భాగంలో రాణి ప్యారిస్, ఆమ్‌స్టర్‌డ్యామ్ వంటి యూరప్ నగరాల్లో పర్యటిస్తే, ఈ ‘క్వీన్ 2’ చిత్రంలో ఆమె ప్రయాణం మన దేశంలోని వివిధ మెట్రో నగరాల చుట్టూ సాగనుందని బాలీవుడ్ మీడియా వర్గాల సమాచారం. మొదటి భాగాన్ని అద్భుతంగా తెరకెక్కించిన దర్శకుడు వికాస్ బహ్ల్ ఈ సీక్వెల్‌కు కూడా దర్శకత్వం వహించబోతున్నారు.



ఈ సినిమాలో కంగనా మినహా పాత నటీనటులు ఎవరూ ఉండరని, ఎక్కువ శాతం కొత్త థియేటర్ ఆర్టిస్టులను ఎంపిక చేసుకుంటున్నారని తెలుస్తోంది. ప్రస్తుతం రాజకీయాలతో బిజీగా ఉన్న కంగనా ఈ సినిమా షూటింగ్ కోసం ప్రత్యేకంగా డేట్స్ కేటాయించినట్లు సమాచారం. ముంబైలో వేసిన ప్రత్యేక సెట్‌లో ఏప్రిల్ నెలాఖరు నుంచి షూటింగ్ ప్రారంభం కానుందని, దాదాపు మూడు నెలల్లోనే ఈ సినిమాను పూర్తి చేసేలా చిత్ర యూనిట్ ప్రణాళికలు సిద్ధం చేయబోతున్నట్లు టాక్.

Printer, Published and Owned by AMBATI PUBLICATIONS at H.No. 8-3-214, Mallikarjun Nagar, Godavarikhani, Dist. Peddapalli. Telangana State - 505 209.“
Printers : Ganesh Offset Printers, Godavarikhani. Editor: P. Ramakrishna, RNI No. TELTEL/2021/02031, email : yadavpolaveni123456@gmail.com, Mobile : 7396644411